# "స్త్రీ"

కె. చెల్లాయి

"అబ్బాయ్.. రవీ... యిలారా బాబూ" అనురాగంతో పిల్చాడు ప్రభాకర్. తండ్రి చేతిలో ఉన్న ఉత్తరం వంకచూస్తూ రవి ఏం నాన్నా అని ప్రక్కనే కూర్చున్నాడు.

ఇప్పటివరకూ కనపడనంత పెద్దగా కన్పడ్డాడు కొడుకు. ఎంత పెద్దవాడు కాకపోతే, యింజినీరింగ్ పాసై యింత మంచి ఉద్యోగం చేస్తున్నాడు.

'చూడు రవీ! నా స్నేహితుడు నారాయణ తెలుసుగా...ఉత్తరం వ్రాశాడు. యింకా నీకొడుక్కు పెళ్ళి ఎప్పుడుచేస్తావంటూ" అని పెళ్ళి అంటే కొడుకులోని మార్పు గమనించేందుకు పరిశీలనగా చూశాడు. చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు రవి. కొడుకు ఉద్దేశం తెల్పుకోకుండానే మీ అమ్మ కోరిక కొంతవరకే తీరింది. రవీ యిక నిన్ను ఒక యింటి వాణ్ని చేయాలని నాకు అనిపిస్తోంది." అన్నాడు.

'అదికాదు నాన్నా—'

"చెప్పరా—సంశయం దేనికి ? వాళ్ళతో సంబంధం మనకు అన్ని విధాల తగినదిరా..."

"ఏదో పెళ్ళి చూపులని చూచి, వివాహంచేసు కోవటం—"

"ఇష్టం లేదంటావు, అంతేనా—"

"అలా అంటే ఏం చెప్పేది నాన్నా పెళ్ళి ప్రస్తావన వచ్చింది కాబట్టి మీకు ఒక కవరు ఇవ్వవలసిన బాధ్యతని..ఇప్పుడే వస్తానుండండి.' అంటూ లోపలికెళ్లి ఒక కవరుతెచ్చి యిచ్చాడు. అందులోని విషయాలు రవికి కూడా తెలియవు.

యిది కాస్త చదవండి నాన్నా...అని అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఆశ్చర్యపోతూ, వెళ్తున్న కొడుకువంకచూస్తూ కవరు విప్పి చదవసాగాడు. కలా నిజమా అనుకున్నాడు. ముఖం వివర్ణమయింది. అశ్రువులు అప్రయత్నంగా ముడుతలు పడబోతున్న దవడల మీద పడుతుంటే, ఒడలంతా వణకసాగింది. అప్పెరువొంది కనులు మూసుకున్నాడు. కళ్ళల్లో ఎన్నో స్మృతులు మెదిలాయి గజిబిజిగా. అతనిమీద అతనికే అసహ్యం పుట్టింది. క్రమంలేకుండ, జ్ఞప్తికి వచ్చే సంఘటనలు సంఘటితం చేసుకోసాగాడు.

అవి అతను అప్పుడు ఉద్యోగంలోచేరిన రోజులు. కాస్త ధనవంతుడే అని చెప్పవచ్చు. మంచి చదువు చదువుకున్నాడు, దానికి తగ్గట్టు మంచి హోదాగల ఉద్యోగం లభించింది.

ఒంటరిగా రోజులు గడుపుతున్న ఆ రోజుల్లో యింటి నుండి అర్జంటుగా బయలుదేరి రమ్మనమని ఉత్తరం వచ్చింది. బయలుదేరి వెళ్ళాడు. వచ్చిన మరిదిని చూచి, వదినగారు-"ఏం మరిదీ మా చెల్లాయిని చూడటానికి వచ్చారేమిటి?' అంది వేళాకోళం చేస్తూ.

"ఏమిటొదెనా-" సిగ్గుపడ్తూ. ఆరాటం వ్యక్తం చేస్తూ అడిగాడు.

"అబ్బే! ఏమిలేదు-" అంది నవ్వుతు.

అతనికి ఆమె చూపుల్లో విషయం తెలిసిపోయింది.

తెల్లవారితే పెళ్ళిచూపుల కెళ్ళాలి. అదే ఆలోచన. యింక నిద్ర ఏమిటి! కునుకే రావడంలేదు. అమ్మాయి చాలా బావుంటుందట. వదిన నిజంగానే చెప్పింది. చాలా బావుందంటే – అదృష్టవంతుణ్ణి.

చాలా మంచిదట, కొంచెం చదువుకుందట. బాగా తెలివైందట, మంచి చలాకీయట, అబ్బ—

ఆ అమ్మాయేవచ్చి జోలపాడిందో... ఎప్పుడు నిదుర పట్టిందో-వదినగారు లేపితే "అబ్బ-బలే కలలే వదినా- అని నవ్వుతూ లేచిపోయాడు.

పెళ్ళి చూపులకు బయలుదేరి వెళ్ళారు. రమ్మన మని కబురు అందగానే. ప్రభాకర్‌కు ఆత్రుత పెరిగింది.

అంతా హాలులో కూర్చున్నారు. యింకా అమ్మాయిని పిలిపించలేదు. ప్రభాకర్ మాత్రం పెద్దవారి కబుర్లుగాని, కాబోయే బావమరుదుల హడావుడిగాని, అగరు సెంట్లసువాసనను గాని గుర్తించడం లేదు. చూడబోయే 'మీనా' ఎలా వుంటుందో అని మరో లోకంలో మనసును విహరింపచేశాడు.

మీనావచ్చి కూర్చుంటూనే ఒకసారి ప్రభాకర్ వంక చూసి తల దించుకుంది అది గమనించిన ప్రభాకర్‌కు ఆ పేరు సార్థక మనిపించింది. నిజంగా ఆ కళ్ళు ఎంత బావున్నాయి. ఎంత చిలిపిగా వున్నాయి. అధరాల అలుకను చూస్తే ప్రభాకర్‌కు మత్తెక్కింది. అలానే చూస్తున్నాడు.

యింటికి రాగానే అంగీకారం తెలిపాడు. వివాహం చాలా సందడిగా జరిగింది.

మొదటిరేయి-ప్రభాకర్ శశిని చూస్తూ అంబుధిని తలచుకున్నాడు. అందులో ఒక మీనం చలాకిగా గంతులేస్తూంది. తన్మయుడయాడు. అర్ధాంగి భుజంపై చేయివేశాడు. మీనా ఒడలు పులకరించింది, అది అతని మధురానుభూతికి, ప్రధమ సోపానమైంది.

'మీనా' అని అనునయంగా పిల్వడంతో 'ఆ'- మాత్రం అని, తలదించేసుకుంది.

ప్రభాకర్ భార్యను తనవైపుకు తిప్పుకుని. కురులు సరిచేస్తూ కళ్ళలోకి చూశాడు. అశ్రుబిందువులు రెండు అలరారుతున్నాయి. కనుల దీప్తిని ద్విగుణీకృతం చేశాయి అవి. అనేక కబుర్లు చెప్పాడు, అన్నిటిని మధురంగా ఆలకిస్తున్నట్లుంది.

మీనా కాపురానికి వచ్చింది. ఉద్యోగం కారణంగా వారిద్దరే వుంటున్నారు. ప్రభాకర్ ఆనందానికి అవధులు లేకపోతున్నాయి. ఏ పని చేస్తున్నా అర్ధాంగి కళ్ళు వెంటాడుతునే వున్నాయి. ఎప్పుడూ భార్యచెంతనే వుండాలని మనసు ఆకాంక్షించడమే కాకుండ, ఆరాటపడుతోంది.

ఒకరోజు సాయంత్రం ప్రభాకర్ యింటికి రాగానే అనుకున్న ప్రకారం మీనా సిద్ధంగా కాక పోయేసరికి కొంచెం నిరాశతో "అదేం మీనా, అట్లా ఉన్నావు, మనం ప్రోగ్రాం పెట్టుకున్నాంగా అన్నాడు.

'అంతగా వెళ్ళాలని లేదండి' అంది మామూలుగా.

"ఎవరైనా వింటే నవ్వుతారు, యింకా సంవత్సరంకాలేదు, ఎలాపడితే అలా వుండాలి-' అనింకా ఏదో అనబోయేసరికి—

మీనా భర్త కోటు విప్పుతూ 'రేపు వెళ్దామండి యింకెప్పుడూ మిమ్మల్ని నిరాశ పరచను' అంది అదోలా.

'ఛ! అదేమిటి' అన్నాడే గాని, ఒకొక్క రకం కార్యక్రమంలో యిటువంటి నిరాశ అతనికి అనుభవమయింది, ఏమిటో అర్థం కాలేదు.

మీనా ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. భర్త ఏమన్నా కాదనడంలేదు, ప్రతిదానికి అంగీకారం తెల్పడం, ఆనందం వ్యక్తపరచడం నేర్చుకుంది, దాంతో ప్రభాకర్ మరీ ముగ్ధుడయాడు, ప్రతీ విషయంలోను భార్యను మెచ్చుకోకుండ వుండలేకపోతున్నాడు, కలలు నిజమవసాగాయి, తనంత అదృష్ట వంతుడు భువిలోనే వుండడన్నంత నమ్మకానికి వచ్చాడు.

మీనా నుండి పొందుతున్న అనురాగం, ఆదరం, ఆప్యాయత. సుఖం అతనిని మరీపిచ్చివాణ్ణి చేస్తున్నాయి, భార్యకు ఏలోటు లేకుండ అన్నీ అమరుస్తూ, అమరసుఖాన్ని పొందుతున్నాడు.

'మీనా! అబ్బాయా—అమ్మాయా-' దగ్గరకు తీసుకుంటూ అడిగాడు, తొంగిచూసే సిగ్గు, తొణకిసలాడే మమత అతన్ని పరవశుణ్ణి చేశాయి.

"దైవానుగ్రహం, ఎవరైనా ఒకటే—మరి మీకు—" అంది నవ్వుతూ,

"అబ్బాయి" అని సమాధానం రావడంతో, "అంత పక్షపాతమా-నిజంగా, నేను అమ్మాయి కావాలని కోరుకోవడంలేదు, అబ్బాయి పుట్టాలని, వాణ్ని తీర్చి దిద్ది, పెద్దవాణ్ని చేయాలని మరీ ఆశగా వుంది, అప్పుడు నాకు పరిపూర్ణ శాంతి లభిస్తుంది. మనిద్దరి కోరిక ఒకటే-" అంది,

"యిదేమిటి మీనా—: యిదేమి కోరిక, అమ్మాయిని తీర్చి దిద్ది పెద్దదాన్నిచేస్తే ఆ సంతృప్తిరాదా, ఆశ్చర్యంగావుందే," అన్నాడు.

సంభాషణ అంతటితో ఆపుచేయాలనే వుద్దేశంతో "ఏమండీ" అని షర్టువంక చూస్తుండిపోయింది,

"అడుగు మీనా, ఏం కావాలన్నా యిస్తాను, అంతకంటె నాకా్కవలసిందేముంది గనుక, నిజంగా-నిన్ను అర్ధాంగిగా పొందడం చాలా అదృష్టం; యింతటి మధురంగా, నిశ్చలంగా దాంపత్య జీవితం గడుస్తుందని అనుకోలేదు, మనసులోవున్న మాట చెప్తున్నా, నన్ను యింత ఆప్యాయతగా, భార్యగానే కాకుండా అన్ని విధాల నన్ను చూచుకుంటున్నందుకు నేనేమిచేసినా, ఋణపడే వుంటాను" అని కళ్ళలోకి ఆశగా చూస్తూ, నెమ్మదిగా దగ్గరకు తీసుకున్నాడు.

వివాహమైన పది సంవత్సరాల తర్వాత తల్లి కాబోతూంటే. ఆశించినదిలభించపోతున్నందుకు మీనాకు ఆనందం, తండ్రి కాబోతున్నాడని తెల్సి ప్రభాకర్ గంతులేసాడు, సంతోషం వర్ణనాతీతం, భార్యను మరీ అపురూపంగా చూచుకుంటున్నాడు. ఆరోగ్యం గురించి పదేపదే అడిగి, ఎన్నో విధాల స్వయంగా సపర్యలు చేస్తున్నాడు,

ఒకరోజు సుప్రభాతాన మీనా ఒక అబ్బాయికి తల్లి అయింది, పసికందును పదేపదే చూడటంలో అవ్యక్తానందం పొందసాగింది. కోరుకున్నది జరుగడం నిజంగా పూర్వజన్మ సుకృతం, ఆసుకృతం, పసికందులో వున్నదెమో అని చిన్న మోమును పరిశీలించింది,

అప్పుడే లోనికి వచ్చిన ప్రభాకర్ తన భార్య విలసల్లిత ముఖాన్ని పరికించి—"అన్యాయం మీనా! నేనున్నానని మరచి పోయావన్నమాట, ఆ ఆనందం నాకూ పంచి పెట్టాలి," నవ్వుతూ అంటూ కొడుకును ఆప్యాయంగా చూస్తూ తాకపోయాడు,

మీనా అడ్డు చెప్పి "అప్పుడేనా—ముట్టుకోకూడదు" అంది చిన్నగా నవ్వుతూ, ఆ నవ్వు పరిభాష ఆమెకే తెలియాలి,

ఆ దంపతుల మధ్య అలరారుతున్న బిడ్డకు 'రవి' అని నామకరణం చేయబడింది, పేరుకుతగ్గ బిడ్డ, ఆ బిడ్డ ఆటపాటలలో భార్యాభర్త లిద్దరూ బాహ్యప్రపంచమే మరచారు, ప్రభాకర్ రవిని అడ్డం పెట్టుకుని చిలిపిగా వేళాకోళా లాడుతున్నాడు దానికి మరీ సిగ్గు పడిపోతూంది మీనా,

రవి పాలనా పోషణలో మీనాకు కాలం తెలియటంలేదు, యింకో ధ్యాస వున్నట్టూలేదు· ఎప్పుడూ రవిని ఆడించడం, కబుర్లుచెప్పడం-ఆనందంపొందడం ఈ ఆనందం ఆమెను మురిపిస్తుంది, ఆశపెడుతుంది.

యీ తరహా కొన్నాళ్ళకు ప్రభాకర్ మనసుకు కొంచెం బాధ కల్గించింది, సహజమని సరిపెట్టుకొని, వేళాకోళంగా "ఎంత కోరిక తీరితే మాత్రం నా మనుగడే తెలియడంలేదా!" అన్నాడు నవ్వుతూనే, నిర్మలంగా.

అప్పటికి మీనా తెప్పరిల్లి, క్షమింపబడని తప్పుచేసిన దానిలా భావం వ్యక్తపరుస్తూ "ఈ తప్పును కూడ క్షమిస్తారు కదూ!" అనిహృదయంపై వ్రాలిపోయింది.

ప్రభాకర్ ఆశ్చర్యపోయాడు, మీనా ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు.

కొద్దిసెకనులాగి "మిమ్మల్నేమనాలో తెలియడంలేదు. నిజంగా మీరు చాలా మంచివారండి. మంచితనమే ప్రతిరూపంగా నా ఎదుట నిల్చిందాఅనిపిస్తుంది. విశాల హృదయులు నేనేతప్పు చేసినా మనాయసంగా క్షమిస్తారు" అంది అదే స్థితిలో.

ప్రభాకర్ మనసు నీరైపోయింది, అలా ఎందుకు ప్రవర్తించానా అనుకుని "అదేమిటి మినా– కేవలం మన దాంపత్య జీవితం నా యిష్టంతోనే సాగితే, మరి నీ వ్యక్తిత్వం. అభిరుచులు!" అన్నాడు.

హఠాత్తుగా మీనా ముఖం పైకెత్తి, కళ్ళు పెద్దవిచేసి ఆశ్చర్యంగా భర్త ముఖంలోకి తదేకంగా చూసింది. భర్త ముఖం ప్రసన్నంగా వుంది. ఏటువంటి 'నటన' అతని మోములోలేదు. తన భర్త యిటువంటి వారని మీన కలలో కూడ అనుకోలేదు. అంతటి అమాయకులని వూహించనేలేదు. మనసులో అంజలిఘటించింది. అయినా...

"ఏం–: అలా చూస్తున్నావు మీనా–నిజంచెప్పు కాకపోతే నేను చాలా బాధపడవలసివస్తుంది, ఏ క్షణమైనా నీకు యిష్టంగానిది ఏమైనాచేశానా - అంత నీచంగా ప్రవర్తించానా–" అడిగాడు మనసాలా. అతని హృదయం నలిగిపోసాగింది.

"చూడండి–మంచితనం మిలో మూర్తీభవించిన కారణంగా మనసువిప్పి మాట్లాడతారు మీరు. అందులో మగవారు. కోపగించుకోకండి–అది మీకు లేదుగా-యిన్నాళ్ళయినా సంసారమంటే అర్ధంగాలేదా నిజంగా-" అంది మనస్ఫూర్తిగా, మృదువుగా. లాలనగా.

'అంటే' కాస్త ఆందోళన సమ్మిశ్రిత ఆశ్చర్యంతో అడిగాడు.

"కేవలం నన్ను సుఖపెట్టాలన్న ధ్యాసేకదూ మీకు" అంది ప్రియవదనంతో.

కంటొయి తుడుస్తూ "ఛ! అదేమిటి మీనా... తప్పుకదూ...మనలో మనం మనసు విప్పుకొని నిర్మలంగా మాట్లాడుకోకపోతే ఎలా! నిన్ను సుఖపెట్టడంకంటె నాకు మరో బాధ్యతలేదు. కాని, నీ బాధ్యత నన్ను ఆనందపరచడమేకాకుండ, అబ్బాయి పోషణ భారం నీమీదుందని నాకు తెల్సు" అన్నాడు.

ఎంత భార్య భర్తలైనా మనసులోని బాధంతా వ్యక్తపరచడం చాలా కష్టం. యిలా వారు అప్పుడప్పుడు మరీ దగ్గరవడం మామూలే.

మీనా కొడుకుపై చాలా శ్రద్ధ తీసుకోసాగింది రవిని ఒక పురుషునిగా మలచాలని ఆమె మనసు ధ్యేయం. అందుకై ఆమె అనేక ముఖ్యసాంఘిక విషయాలను గూర్చి, రవి మనసు వాటిని ఆకట్టుకునే విధంగా. నిష్పక్షపాతంగా చెప్పడం విధిగా భావించింది. చాలా శ్రమ పడుతుంది. రవి కూడ వుత్సుకత చూపి నిర్మల మనసుతో ఆకళింపు చేసుకునేవాడు. వారిని చూసి ప్రభాకర్ ఆనందించాడు. ఆశించడమే కాకుండ చేతలలోకూడ చూపిస్తున్న భార్యను మెచ్చుకున్నాడు.

రవి కాలేజిలో చేరాడు. తల్లి చెప్పిన ప్రతీ విషయానికి అతని మనసులో తావుంది. అంత గౌరవించాడు. అతనంటే చాలా మందికి అపరిమిత గౌరవం. తల్లి చెప్పిన లోటు సంఘంలో చూడగల స్థితికి వచ్చాడు. ఏ ఒక్కటి అబద్ధంకాదు. తన తల్లి స్త్రీ అయినంత మాత్రాన పక్షపాతం చూపలేదు. 'ఆడది' అంటే తన తల్లికి అసహ్యం.

యింటి నుండి టెలిగ్రాం రావడంతో రవి ఆందోళనతో వెన్వెంటనే యింటికి వెళ్ళాడు. చూస్తే

తండ్రికి అనారోగ్యం. విషయం తెలియపరచకుండ టెలిగ్రాం యిచ్చింది మీనా. తండ్రిని కుశలప్రశ్నలు వేసి తల్లితో కొంచెము కోపముగానే "అదేమిటమ్మా-మరి టెలిగ్రాం యిలా యిచ్చావేం..." అడిగాడు.

'తర్వాత మాట్లాడుకుందాం గాని. ముందు స్నానంచేసిరా బాబూ. అలసిపోయివుంటావు' అంది అతి సౌమ్యంగా, కన్న ప్రేమతో.

కళ్లలలో నీళ్ళు తిరిగాయి.

రవి స్నానం, టిఫెన్‌చేసి వచ్చాక, ప్రభాకర్ కొడుకును దగ్గర కూర్చోబెట్టుకొని 'చూడు నాన్నా అమ్మను చూశావా-ఎలా ఉందో చూడు. రాత్రింబవళ్ళు మంచం దగ్గర నుండి కదలదు. సరిగా తినదు. సతతం యిలా కూర్చునే సపర్యలు చేస్తుంది. ఆరోగ్యం పాడవ్వదూ. నువ్వైనా చెప్పు' అన్నాడు ఆయాసంతో.

"యిదేమి ధోరణండి. యింతలాఅయితే ఎలా!-చూడు బాబు బజారువెళ్ళి యీ మందులు తీసుకురా! నాన్నగారికి ఫరవాలేదని డాక్టరు గారు చెప్పారు" అని మందుచీటి యిచ్చింది.

అంతవరకు తల్లిని సరిగా చూడని రవి "అదేమిటమ్మా-అంత లావున్నావు. మందేమి తీసుకోవటంలేదా!" అని అన్నాడంతే గాని మనసులో అతను అనుభవించిన బాధ యింతాఅంతాకాదు. 'కన్నతల్లిని ఆప్యాయంగా పలుకరించి శ్రద్ధ తీసుకునేది పోయి, రాగానే అజమాయిషీ. కోపంతో అధగదమా' అని తల్లడిల్లిపోయి, ఇక అక్కడవుండలేక, తల్లి మరల చెప్పడంతో బయటకు వెళ్ళిపోయాడు.

"మీనా నీలో ఏదో మహత్తర శక్తి ఉంది. అది ఒకవేళ నీవు స్త్రీ అయి వుండటమే కారణం కావచ్చు. అయినా నీలో ప్రత్యేకత వుంది, ఆ ప్రత్యేకతను నీలో సదా నేనున్నంతకాలం చూడాలని వుంది, మరి నీవు నీఆరోగ్యం సరిగా చూచుకోవు. నీలా నేను నీకు ఆరోగ్యం చేకూర్చలేక పోవచ్చు. ఎన్నిరోజులు నువ్విలా వున్నావో తెలుసా. అద్దంలో నీ ముఖం చూచుకో-నీమాట ప్రకారమే అబ్బాయిని కబురు పంపించావు లేకపోతే వాడు హైరానాపడేవాడు-' అనింకా ఏదో అనబోతుంటే-

"అలా అనకండి-అందుకొక్కడండి-వాడు పసివాడు, అందులోనూ నేనున్నాననే వాడికి బాధ్యత కల్పించలేదు. అంతేగాని, యిందులో శ్రమనేదిలేదు. అటువంటిమాట మనసులో రావచ్చా" అంది. ఆఖరి మాట కడుముద్దుగా వుంది.

దానికి నవ్వుతూ "మీనా-ముఖ్యంగా నీ మనసును ఆరాధిస్తున్నాను-అందుకేనేమో నేను చనిపో"-

నోటికి చేయి అడ్డంపెట్టి, కంటతడిపెడ్తూ 'అటువంటి మాట లెప్పుడూ అనకండి-నేనుండగా మీకేం ఫరవాలేదు. అలా అంటే నా మనసెంత క్షోభకు గురవుతుందో మీకు తెలుసా-అంతటి కఠిన శిక్షకు గురిచేస్తారా - అతలంపే రానివ్వకండి. పూర్తిగా విశ్రాంతి తీసుకోండి. అబ్బాయితో జబ్బు ప్రస్తావన తీసుకురాకండి ఆందోళన చెందుతాడు" అని పళ్ళరసం యిచ్చింది.

చేతులమీదుగా యిచ్చిన ఫలరసామృతం సేవిస్తూ భార్యవంక చూస్తున్నాడు.

మీనా సిగ్గుతో తల వంచుకుంది.

మరల ప్రభాకర్ భార్యచేసిన నిస్వార్ధసేవల గురించి మాట్లాడబోతుంటే 'అదే వద్దన్నానా-మీరు నాకు చేసినదానిలో యిది ఎన్నోవంతు! నేను మీ అర్ధాంగిని-సరా-యిప్పటికేనా అర్ధమయిందా" అంది చిరునవ్వుతూ.

ఆ చిరునవ్వులో మునుపటి ప్రశాంతత ప్రభాకర్‌కు లభించలేదు. మనసు అశుభానికి గురయింది.

రవి యింకా రెండు రోజులుండి వెళ్లాలనే వుద్దేశ్యంతో 'అమ్మా-ఇంకా రెండు రోజులుంటానే-

నువ్వు చూడెలా వున్నావో-నా చదువుకేం ఫరవా లేదు' అన్నాడు.

మినా ఫరవాలేదనడంతో వె ళ్ళి పో వ ల సి వచ్చింది.

మినా నీరసం ఏమి తగ్గలేదు. జ్వరతీవ్రత బాగా వుంది. ఎన్ని మందు లిప్పించినా ఫలితం లేక పోయేసరికి 'మినా నిజంగా నా ముఖంలోకి చూచి చెప్పు. నీ మనసులో ఏ మనోవ్యాధిలేదుకదూ-లేక పోతే మరేమిటి-నిజంచెప్పు!' అన్నాడు ప్రభాకర్ కళ్ళల్లోకి నీళ్ళు తిరుగుతుండగా—

కళ్ళు తుడుస్తూ 'ఆదేమిటండి నాకేం అసం తృప్తిలేదు. మనోవ్యాధిలేదు. నన్ను మీరెప్పుడూ అసహ్యించుకోలేదు మిరు బాధపడకండి. మి ఆరో గ్యంపాడవుతుంది' అంది నిష్కల్మషంగా.

పెలిగ్రాం అందగానే బయలుదేరి వచ్చిన రవి త ల్లి ఆవస్థ చి ఏడ్చేసాడు.

"తప్పుకదూ రవీ! నాన్నారున్నారుగా! బాగా చదువుకో-బాగా నడచుకో. అంతకంటే నాకేంకావాలి" అంది అతిప్రయాసతో, ఆ మాట లాలకించిన ప్రభా కర్ భార్యచేతులు పట్టుకుని కంటతడిపెట్టాడు.

రెండు రోజులు గడిచాయి. 'నిన్నా స్థితికి అతి ప్రయాసతో తీసుకొచ్చాను. నా ఆశలు అడి యాసలు చేయకు. నువ్వు శుభ్రంగా వివాహం చేసు కొని సుఖంగా జీవించు. అది చాలు నాకు, ఏ పరిస్థి తులలోనూ నాన్న గార్కి కష్టం కలిగించకు. నీకిష్టం గానిది చెబితే, విడమరచిచెప్పు. మనసును బాధ పెట్టకు-నాన్న చాలా మంచివారు. ఈ కవరు నాన్న గార్కి యివ్వు' అని మూడో రోజున చెప్పింది మినా.

ఏడుస్తూ "ఎప్పుడివ్వమంటావు అమ్మా" అన్నాడు రవి.

"రవీ నీకెలా చెప్పాలో తెలియడంలేదు. నేను చెప్పిన ప్రకారం నడచుకుంటే నీ జీవితం సుఖమయమవుతుంది. వైవాహిక జీవితం గురించి చెప్పాను అలా నీవు ప్రవర్తించినప్పుడు నాన్నారు గనుక విముఖత చూపిస్తే ఈ కవరు యివ్వు. లేక పోతే అసలివ్వవద్దు. తెల్సిందా" అంది గంభీరంగా అంతటి స్థితిలోనూ.

ప్రభాకర్ చేతులలో శాశ్వతంగా కళ్ళు మూసింది మినా.

ఇప్పుడవని యింకా అంధకారబంధురమైంది ప్రభాకర్‌కు. అన్నిటిని చక్కగా అమర్చి పెట్టేది మీనా. ఏలోటూ కలిగేదికాదు. వివాహానికి పూర్వం ఒక తరహా అనుభవం. ఇప్పుడు ఒక తరహా. యిది మరీ అనుభవ సాధ్యంకాకుండావుంది. ప్రతిరోజూ ఉదయంలేవగానే అర్ధాంగిఫోటో చూచి కళ్ళు మూసు కుంటాడు. తలువని క్షణముండదు. మీనా వాంఛ ప్రకారం రవికి ఇంజనీరింగ్ చదివించాడు. యిక వివాహం చెయ్యాలి. అవివాహ ప్రసక్తి వచ్చినపుడే రవి తండ్రికి కవరు యిచ్చింది. మరల అతనికి ఆ ఉత్తరమంతా కనులలో మెదలసాగింది.

"దైవసమానులైన మీకు వందనములు.

ఈ ఉత్తరం వ్రాసే సాహసం,-మీ హృదయ విశాలత, ఉదారత, మీ మంచితనం నాకు ప్రసా దించాయి. ఈ ఉత్తరం చదివినా, మీరు నన్ను అస హ్యించుకోరని నా ప్రగాఢ విశ్వాసం. నాకేదో అన్యాయం చేశారని ఏమాత్రం బాధపడినా, నాఆత్మకు శాంతి యుండదు. ఈ ఉత్తరం కేవలం ఎందుకు వ్రాస్తున్నానంటే—రవి వివాహ విషయంలో మిరు నా అభిప్రాయానికి విలువ, గౌరవం యిస్తారని. అది మికు తెలియాలని, మికు తెల్సినవార్కి పరోక్షంగా చెబితే నాలాంటి స్త్రీల ఆశలు నెరవేరుతాయని, అంతే.

మిరు నాకు ప్రసాదించిన వ్యక్తిత్వం మరువ రానిది. అంజలి ఘటిస్తున్నాను. కాకపోతే మన్నించ గలరు. మిదగ్గర నాకుండే చనువు పురస్కరిందో కుని చెప్తున్నా. బ్రతికుండగా ఎందుకు చెప్పలేచు

అర్థం చేసుకోగలరు. మీతో వివాహానికి నాకసలు యిష్టంలేదు. అని మా తల్లితండ్రులతో పరోక్షంగా చెప్పినా "అతనికేం-అందంగా వుంటాడు-మంచి ఉద్యోగం-యికలోటేమిటి" అని వారు ఒప్పించినట్లు భావించి, వివాహం ఖాయపరిచారు. అటువంటి పరిస్థితులలో కన్నె పరిస్థితి ఏ పురుషుడూ గ్రహించడు. కనీసం స్త్రీ అయినా సరిగా ప్రవర్తించదేమో! నా విషయంలో అలానే జర్గింది. మనం. సహజంగా, యిష్టంలేని పని ఒక క్షణం చేయాలంటేనే చాలా బాధకు గురిఅవుతాం. అటువంటప్పుడు జీవితమంతా యిష్టంలేకుండ గడుపాలంటే ఎంత నికృష్టమో ఆలోచించండి. అందులో స్త్రీ.

వివాహాలు ఖాయపరచే సమయంలో అబ్బాయి యిష్టానికి యిచ్చినంత విలువ "అమ్మాయి" యిష్టానికి యివ్వరు. ఎందుచేతో తెలియదు. యిది నగ్న సత్యం. వివాహానికి అమ్మాయి ఇష్టపడిందా అని అబ్బాయి తెల్సుకోదలుకుంటా, 'వాళ్ళ కిష్టమేనా' అని తెల్సుకుంటారు అబ్బాయికి అమ్మాయి నచ్చితె వివాహం కాయమైనట్లేనే. యిటువంటివి నా అనుభవం తర్వాత చాలా చూశాను. కొందరు సర్దుకుపోతారు— భర్త మంచితనం కారణంగా, సున్నిత హృదయాలు బాధపడతారు, కొంతమంది స్త్రీలు ఆడవారిగా తయారవుతారు. నా ఉద్దేశంలో "ఆడది" అంటే నీచమైనది. "స్త్రీ" అని ఉచ్చరించేటప్పుడు, "ఆడది" అని పలికేటప్పుడు విమర్శగా చూడండి-యిది మీకు నమ్మకం లేకపోవచ్చు. స్త్రీ అవివాహితగా వుండటం చాలా కష్టం, కారణం ఆడవారిమూలానే. వారిని అసరాగా చూసుకుని మగవారు ప్రతి స్త్రీని అలుసుగా తీసుకుంటారు. అసలి ప్రపంచం మగవారికోసమే అన్నట్లుంది, పుష్పాలు స్త్రీలకోసం ఎలాగో. స్త్రీలు పురుషులకోసం. పుష్పానికోసి. ధరించే సమయంలో దాని యిష్టాయిష్టాలు స్త్రీకు ఎలా అనవసరమో-స్త్రీల విషయంలోకూడా అంతే. తనభిప్రాయం తెలుపగల శక్తి వుండీకూడ వ్యక్తం చేయలేరు—చేయాలనుకున్నా అవకాశామివ్వరు.

అటువంటి స్త్రీ నుండి పురుషుడు పొందే ఆనందం మామూలుధోరణిలోనే వుంటుంది. మీకు నేను చేయరాని అన్యాయం చేశాను, ఎంత కాదనుకున్నా తప్పలేదు మనస్పూర్తిగా అన్ని సుకాలు యివ్వలేకపోయాను మొదట. వయసు మళ్లిన తర్వాత-కొన్నాళకు యాంత్రికమే అయింది. ఆ తర్వాత మీ మంచితనాన్ని తలువని క్షణంలేదు. పాపం మీరు సుఖ సౌభాగ్యాలు అనుభవిస్తున్నారని అనుకున్నారు. మన అభిరుచులు, నడకనుబట్టి ఆవతలివారి చేష్టలను మన కనుగుణంగా భావించడంలోనే వుంటామే గాని. యింకేమి పరికించే పరిస్థితులలో వుండము. మీరనుభవించిన వాటిలో నా సుముఖత గనుకేవుంటే (శారీరకంగా) నిజంగా మీరు చవిచూడనిది వుండేదికాదు. మీ జీవితం స్వర్గతుల్యమే అయుండేది. అది లేనికారణంగా, మరి కొన్నిటిని అర్పించలేకపోయాను. మీరుచేసినదానికి, కృతజ్ఞతగా చాలా చేశాను మీకు. కాని, అయిష్టంగా మీజీవితంలో ప్రవేశించి మీకు ఆనందం చేకూర్చలేకపోయాను. అదిమాత్రం క్షమార్హంకాదు. అయిష్టంగా ఎందుకు ప్రవేశించానంటారా! అది మీ ఉదాంతకే వదిలివేస్తున్నా.

అయినా మీ కేలోటు రానివ్వలేదు. మీరు అనారోగ్యంగా వున్నప్పుడు నా శాయశక్తులా నా ఆరోగ్యం విస్మరించి మీకు సేవ చేశాను. మీకేలోటు రానివ్వలేదనే నమ్ముతూ మీనుండి వెడలిపోతున్నాను,

నేనేమీ సుఖపడలేదని మీరు సుఖపడలేదని యిప్పుడు బాధ పడవద్దు. నేను తెలియచెస్తేనే గాని. మీకు ఆలోటు అప్పుడు. యిప్పుడు కూడా తెలియదు. యిది కేవలం మన రవి విషయంలో జరుగకుండ వుండేందుకే.

అసలీ వుత్తరం మీకు ఆశ్చర్యం కలిగించవచ్చు "ఒక స్త్రీ యిష్టం లేకుండ ఒకరితో జీవితమంతా గడపగల్గిందా! తర్వాత యిలా ప్రవర్తిస్తుందా" అని, ఏ స్త్రీ విషయంలో ఏమిజరిగినా నమ్మవలసిందే. ఆ జీవి స్త్రీ గనుక, ఈ ఉత్తరం ఎవరైనా చదవడం సంభవిస్తే-చాలా మంది మగవారు, కొంతమంది స్త్రీలు ఆశ్చర్యపడతారు, నమ్మరు. స్త్రీ విషయం

యింతగా ఎందుకు చెబుతున్నానంటే పుష్పజాతులన్నీ ఎలా ఒకలాగే వుండవో. స్త్రీ లందరూ ఒక్కలాగే వుండరు. అదే స్త్రీ పురుషులతో వున్న భేదం. ఒక జీవితం వెచ్చించి పురుషుని మ:సు అర్థం చేసుకోవచ్చు గాని. స్త్రీ మనసును అర్థం చేసుకోలేరు. అందుకే లభించిందీ-వాక్యాన్ని పూర్తి చేయలేను.

నమస్కృతులతో

మీ అర్ధాంగి

మినా.

అతని కనులలో ఉత్తరంలోని సంగతులు మననం అయిన కారణంగా ప్రభాకర్ మనసు యిప్పుడు నిశ్చలంగా వుంది గాని, దేనికీ గురికాలేదు భార్య ప్రతిచర్య వుత్తరంతో సరిపోల్చుకుంటే అన్వయమయింది-అపుడు తన అభిప్రాయాలకూ సరిపోయాయి, మినా వ్రాసిన ప్రతీ అక్షరం నిజం, అ.దుకే కొడుకు కావాలనుకుంది మినా. "రవి" అని నామకరణం చేయాలని పట్టుపట్టింది, మినా అంత సాధ్వీమరాలు ఎవరూ వుండరేమో...

అందుకే మామూలిధోరణిలో "రవీ" అని పిల్చాడు నాన్నా-నేనంటే నీ కిష్టమేనా_అని అడిగాడు.

'అదేమిటినాన్నా' అన్నాడు తెల్లబోతూ.

"ఏమిలేదులే - నీ యిష్టం వచ్చినట్లు కానివ్వు" అన్నాడు.

తండ్రివంక ఆశ్చర్యంగా చూశాడు రవి.